

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-8 ఆధ్వర్యంలో సమీప గ్రామం యనాది కాలనీ ఎంపియుపి పాఠశాల ఆవరణ సమీపంలో ఉన్న డంప్ యార్డ్‌ను శుక్రవారం శుభ్రపరిచి, ఐబిటి ట్రాక్టర్‌ను ఉపయోగించి చెత్త మొత్తాన్ని ఊరి చివర పారవేశారు. సాయంత్రం ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను, అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి పారవేశారు. ఈ కాలనీని పరిశుభ్రత బాటల వైపు ముందుకు తీసుకెళ్లాలని యూనిట్-8 ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.భాను వినోలియా ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపియుపి పాఠశాల వద్ద శుభ్రం చేస్తుండగా అక్కడికి సందర్శించడానికి వచ్చిన స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎం.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.లక్ష్మణరావు చేతులమీదుగా కొన్ని మొక్కలను నాటారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేసిన శుభ్రత కార్యక్రమంలో వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు.

‘చింతలపూడి’ ‘ఎత్తి’పోయనట్టేనా..!

- ప్రభుత్వ మాటలకు. చేతలకు పొంతన కరువు
- జిల్లా సాగునీటి ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల కీలకం
- 4.80 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టు మూలకు
- సిఎం జిల్లాకు వచ్చిన ప్రతిసారీ చింతలపూడి పూర్తి చేస్తామని ప్రకటన
- ఏడాదిన్నర గడిచినా ఒక్క అడుగూ ముందుకు పడని పరిస్థితి
- గడిచిన ఎన్నికల్లో రైతులకు ఎంపీ, ఎంఎల్‌ఎల వాగ్దానాలన్నీ తూచ్
- రైతులకు ఇప్పటికీ తీరని పరిహారం సమస్య

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాకు అత్యంత ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూటమి సర్కార్ పూర్తిగా పక్కన పెట్టేసింది. జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారీ చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేస్తామని సిఎం ప్రకటనలు గుప్పించడం మినహా ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. గడిచిన ఎన్నికల్లో చింతలపూడి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, మంత్రి కొలుసు పార్థసారధి, ఇతర ఎంఎల్‌ఎలంతా రైతులకు వాగ్దానాలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదిన్నర గడిచినా చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాల్లేవు. 2028కి చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడమే తప్ప అందుకు తగిన కార్యాచరణ ఏమాత్రం లేకుండాపోయింది. దీంతో మెట్ట ప్రాంత రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇప్పటికీ రైతులకు సంబంధించిన భూపరిహారం సమస్యను సైతం పరిష్కరించని పరిస్థితి ఉంది. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి దాదాపు 17 ఏళ్లు గడుస్తున్నా చుక్కనీరూ పారని దుస్థితి నెలకొంది. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి తరలించాలన్న లక్ష్యంతో 2008లో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 మెట్టప్రాంత మండలాల్లో రెండున్నర లక్షల ఎకరాలకు సాగు, పలు గ్రామాలకు తాగునీరు ఇచ్చేవిధంగా రూ.1,701 కోట్లతో ఈ ప్రాజెక్టుకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించినా ముందుకు సాగలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం 2018 నాటికల్లా పూర్తి చేస్తామని ప్రకటించింది.



చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ

అంతేకాకుండా ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేసింది. కృష్ణా జిల్లాలోని పలు మండలాలకు చింతలపూడి ఎత్తిపోతల ద్వారా సాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేలా మార్పులు జరిగాయి. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4,909 కోట్లకు పెంచారు. కొంతమేర వేగంగా సాగినా ప్రాజెక్టు మాత్రం పూర్తి చేయలేదు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చింతలపూడి ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని సిఎం చంద్రబాబు జిల్లా పర్యటనల్లో ప్రకటిస్తూనే ఉన్నారు. పనులు మాత్రం జరగడం లేదు. గడిచిన బడ్జెట్‌లో రూ.200 కోట్లు వరకూ కేటాయించిన పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి. చింతలపూడి ప్రాజెక్టు నుంచి నీరు ఎత్తిపోయనట్లేనా అంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పరిహారం సమస్య తీరేదెప్పుడో..!

తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ప్రాజెక్టుకు భూమి ఇచ్చిన రైతులకు న్యాయం చేస్తామని 2019 ఎన్నికల ముందు చింతలపూడి సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆ పార్టీ అధ్యక్షుడి హోదాలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల గురించి పట్టించుకున్న పాపాన లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు, ప్రభుత్వం ఇస్తానని ప్రకటించిన ధరకు సంబంధం లేదని రైతులు అప్పట్లో పెద్దఎత్తున నిరసనలకు దిగారు. కాల్వ తవ్వకాలను అడ్డుకున్నారు. కొంతమంది రైతులు కోర్టుకు వెళ్లారు. ఎకరా విలువ బహిరంగ మార్కెట్లో రూ.50 లక్షల వరకూ ఉండగా, ప్రభుత్వం రూ.19 లక్షలు ఇవ్వడంపై రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికీ రైతులకు సంబంధించిన పరిహారం సమస్యకు పరిష్కారం చూపని పరిస్థితి. ఇప్పటికైనా రైతులకు పరిహారం అందించి, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో మెట్ట ప్రాంతంలో కూటమి సర్కార్‌కు ఎదురుదెబ్బ తప్పదని చెప్పొచ్చు.

‘పది’లో ఉత్తమ ఫలితాల కోసమే విద్యామృతం

జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన మంత్రి కొలుసు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నియోజకవర్గంలోని 32 హైస్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వంద రోజులపాటు సాయంత్రం పూట అల్పాహారం అందించి, వారికి చదువుపై ఏకాగ్రత పెంపొందించడమే నారా లోకేష్ విద్యామృతం ముఖ్యోద్దేశమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన తండ్రి కొలుసు పెద్ద రెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అందించే అల్పాహారం కార్యక్రమానికి ఆయన నారా లోకేష్ విద్యామృతం పేరిట శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని 32 ఉన్నత పాఠశాలలకు సరుకుల పంపిణీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన తండ్రి పడిన కష్టాలకు రుణం తీర్చుకోవాలనే సదుద్దేశంతో ఆయన పేరిట ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు రావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమానికి వారానికి రూ.1.5 లక్షలు చొప్పున వంద రోజులకు రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ డాక్టర్ పివిఎస్.సుధాకర్, తహశీల్దార్ పివిఎస్.ప్రసాద్, ఎంపిడిఒ బి.భార్గవి, డివిజన్ విద్యాశాఖాధికారులు, టిడిపి మండలాధ్యక్షులు ఎస్.వేణు, ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, విద్యాకమిటీ ఛైర్మన్ ఎ.నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సరుకులను పరిశీలిస్తున్న మంత్రి

చిన్నతనం నుండే దృఢమైన మనస్తత్వం అవసరం

‘వీర్ బాల దివస్’లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - పెదపాడు

చిన్నతనం నుండి ప్రతిఒక్కరూ దృఢమైన మనస్తత్వం కలిగి ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన ‘వీర్ బాల దివస్’ కార్యక్రమాన్ని ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కలెక్టర్ మాట్లాడుతూ సత్యం, ధర్మం, ధైర్యం, దేశప్రేమ వంటి నైతిక విలువలను చిన్నతనం నుండి కలిగి ఉండాలన్నారు. సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్ జీ నలుగురు కుమారుల (సాహిబ్జాదేస్) సాహసం, త్యాగాలను స్మరించుకుంటూ ‘వీర్ బాల దివస్’ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం డిసెంబర్ 26న జరుపుకుంటున్నామన్నారు. వారి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ దేశ సమైక్యత, సమగ్రతలు, తాము నమ్మిన సిద్ధాంతాలు, విశ్వాసానికి కట్టుబడి ఉండాలన్నారు. బాహ్య ప్రలోభాలకు లొంగకూడదని, ఎటువంటి విషమ పరిస్థితులు ఎదురైనా తాము నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని అన్నారు. ప్రజల రక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఉందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండి ధైర్యసాహసాలు కలిగి ఉండాలని, తమ పరిసరాల్లో జరిగే అన్యాయాలు, అకృత్యాలను తెలియజేయాలన్నారు. తమ పరిసరాల్లో ర్యాగింగ్,



జ్యోతి ప్రజ్వలనలో కలెక్టర్, చిన్నారి


మహిళలపై అఘాయిత్యాలు వంటివి గుర్తిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. గృహహింస వంటి ఘటనలను 181కి ఫోన్ చేసి తెలపాలన్నారు. ప్రస్తుత రోజుల్లో స్వీయరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ శారద, బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి రామ్‌కుమార్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనులపై తప్పుడు కేసులు తగవు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఇనుమూరులో పంట ధ్వంసాన్ని అడ్డుకున్న అమాయక గిరిజనులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఇనుమూరులో సంఘటన చోటుచేసుకున్న భూములను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఇనుమూరు గ్రామ గిరిజనులపై రెవెన్యూ, పోలీసు, భూస్వాముల మూకుమ్మడి దాడిని తప్పుబట్టారు. గిరిజనులు సాగు చేసిన పంటను ధ్వంసం చేయడమే కాకుండా గిరిజనులపై విరుచుకుపడ్డారని, మహిళలపై మగ పోలీసులే దాష్టీకానికి పాల్పడ్డారని అన్నారు. మళ్లీ గిరిజనులదే తప్పన్నట్లు వారిని నేరస్తులుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజనులపై దాడి చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై దశలవారీ పోరాటం చేపడతామని, ఎవరినీ వదిలిపెట్టేది లేదని అన్నారు. గిరిజనుల పక్షాన నిలబడాల్సిన అధికారులే భూస్వాముల కాసులకు అమ్ముడుపోయి గిరిజనులకు తీవ్ర నష్టం చేస్తున్నారని అన్నారు. నష్టపోయిన పంటను పరిశీలించి ప్రభుత్వం గిరిజన ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నేతలు కారం ముత్యాలరావు, జోడెం చంద్రరావు, కారం దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.




భూములను పరిశీలిస్తున్న రవి, నేతలు

పట్టుదలతో కృషి చేస్తేనే విజయం

పొంద్రి రాము, పసలపూడి నానిలను అభినందించిన ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

గుర్రపు డెక్క తొలగించే మిషన్ పనితీరు పరిశీలన



పొంద్రి రాము, పసలపూడి నానిలను అభినందిస్తున్న ఎస్‌పి, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మండవల్లి

ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందని, ఆ దిశగా ఆలోచించి ఆలోచనలకు పట్టుదలను జోడించి కృషి చేస్తే సాధించలేనిది అంటూ ఏమీ ఉండదని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. కైకలూరు ఏలూరు ప్రధాన రహదారిలోని పోల్‌రాజ్ కాలువ వద్ద పొంద్రి రాము పసలపూడి నాని తయారుచేసిన గుర్రపు డెక్క తొలగించే మిషన్ పనితీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తరువాత వచ్చిన వరదలకు గ్రామాలు, రహదారులు నీట మునిగి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. దీనికి ముఖ్య కారణం గుర్రపు డెక్క మేటవేసుకుపోయి అడ్డు పడడమేనని గమనించినట్లు చెప్పారు. అంతేకాకుండా వరదల సమయాల్లో ప్రతిసారి ఇదేవిధంగా జరుగుతుందని, యుద్ధ ప్రాతిపదికన పొక్లెయిన్‌లను వినియోగించి గుర్రపు డెక్కను తొలగిస్తున్నామని గ్రామస్తులు, నాయకులు తెలిపారన్నారు. ఈ సమస్య పరిష్కారమయ్యే దిశగా ఇతర దేశాల్లో గుర్రపు డెక్క తొలగించడానికి ఎలాంటి మిషన్లు వినియోగిస్తున్నారనేది తెలుసుకుని కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే ఫొంద్రి రాము పసలపూడి నానితోపాటు కొంతమంది సమిష్టిగా ఏర్పడి ఇతర దేశాల్లో గుర్రపు డెక్క తొలగించేందుకు వాడుతున్న మిషన్‌ను ఇక్కడే తయారు చేస్తామని ముందుకొచ్చినట్లు చెప్పారు. ఇతర దేశాల్లో వాడుతున్న మిషన్‌ను ఆధారం చేసుకుని ఫొంద్రి రాము పసలపూడి నాని వారికున్న పరిజ్ఞానాన్ని జోడించి గుర్రపు డెక్క తొలగించే మిషన్ తయారుచేసి నేడు అందరి సమక్షంలో మిషన్ ఉపయోగించి గుర్రపు డెక్కను తొలగించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. చదువుకున్న విద్యకు పదును పెడితే ప్రతిసమస్యకూ పరిష్కారం లభిస్తుందని ఫొంద్రి రాము, పసలపూడి నాని రుజువు చేశారని, ప్రతిఒక్కరూ ఆ విధంగా ఆలోచించాలని చెప్పారు. ఆలోచనలకు పట్టుదలను జోడించి కృషి చేస్తే మంచి ఆవిష్కరణలు వెలుగు చూస్తాయని, వాటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతావని తెలిపారు. అనంతరం మిషన్ పనితీరును పరిశీలించి సంతోషాన్ని వ్యక్తం చేసి ఈ మిషన్ తయారుచేసిన ఫొంద్రి రామును, పసలపూడి నానిని అభినందించి తయారీకి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మిషన్ పనితీరు పరిశీలించిన ఎంఎల్‌ఎ శ్రీనివాస్

వరద సమయాల్లో నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డుపడి రోడ్లు, రహదారులు, గ్రామాలను ముంచేత్తుతున్నాయని కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. పొంద్రి రాము, పసలపూడి నాని ఆధ్వర్యంలో తయారుచేసిన తూడు తొలగింపు మిషన్ పనితీరును కాకతీయ నగర్ పోల్‌రాజ్ కాలువ వద్ద ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో గుర్రపు డెక్క పెద్ద సమస్యగా ఏర్పడిందన్నారు. వరద నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డుపడడంతో రోడ్లు, గ్రామాలు, పంట పొలాలు నీట మునిగిపోతున్నాయన్నారు. దీనిపై ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ దృష్టికి తీసుకెళ్లగా ఇతర దేశాల్లో తూడు తొలగించడానికి వినియోగించే మిషన్లను ఆయన చూపించారని చెప్పారు. ఆ మిషన్ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా రూ.90 లక్షలు ఉంటుందని చెప్పారన్నారు. పొంద్రి పనుల్లో దిగ్గజుడైన పొంద్రీ రామును పసలపూడి నానికి విషయాన్ని తెలియపరచగా వారితో మరి కొంతమందిని కమిటీగా ఏర్పాటు చేసుకుని శ్రమించి ఎంతో గొప్పగా గుర్రపు డెక్క తొలగించే మిషన్‌ను తయారుచేశారన్నారు. దాని పనితీరు కూడా ఎంతో సమర్థవంతంగా ఉందని తెలిపారు. అది కూడా కేవలం రూ.పది లక్షలు ఖర్చుచేసి తయారు చేయడం మరింత సంతోషదాయకమన్నారు. ఈ సలహాను అందించిన ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మిషన్‌ను అద్భుతంగా తయారుచేసిన రాము పొంద్రి అధినేత రామును, పసలపూడి నానిని అభినందించారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి, ఇరిగేషన్ శాఖ మాచర్ల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.


సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

జాతీయ స్థాయి వర్క్‌షాపునకు ధర్మాజీగూడెం విద్యార్థులు

ప్రజాశక్తి - చింతలపూడి

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఈ నెల 27వ తేదీన జరిగే తెలంగాణ టీ హబ్‌లోనే జాతీయస్థాయి ఎడ్యుకేషన్ ఈవెంట్ రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు వర్క్‌షాపునకు ఆంధ్రప్రదేశ్ నుంచి మొట్టమొదటిసారిగా 12 మంది ఎంపికయ్యారు. ఎంపికైన లింగపాలెం మండలం ధర్మాజీగూడెం క్రిసలీస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఆయన క్యాంపు శుక్రవారం అభినందించారు. పాఠశాల డైరెక్టర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు తాడేపల్లి రాజా క్రాంతికుమార్, బట్టు విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ

వంతెన వద్ద దట్టంగా గుర్రపు డెక్క మేట

నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన వైనం

తొలగించాలని ప్రజలు వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రధాన పంట కాల్వ ద్వారా మంచినీటి చెరువులకు వెళ్తున్న నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డంకిగా మారింది. గత వారం రోజులుగా మండలంలోని మంచినీటి చెరువులకు అధికారులు కాలువల ద్వారా తాగునీటిని విడుదల చేశారు. ఈ నీరు బ్రాంచ్ కాలువల ద్వారా ప్రవహించి మంచినీటి చెరువుల్లోకి చేరుతుంది. ప్రస్తుతం నీరు నియోజకవర్గ శివారు ప్రాంతానికి వెళ్తుంది. పలుచోట్ల గుర్రపు డెక్క వంతెన వద్ద కానాలకు పట్టి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ముదినేపల్లిలోని మూడో బజార్ వద్ద పోల్‌రాజు కెనాల్‌పై ఏర్పాటుచేసిన కాలిబాట వంతెన వద్ద ఎగువ నుంచి కొట్టుకొచ్చిన డెక్క వంతెన కానాలకు పట్టి వేసింది. దీంతో దిగువకు నీటి పారుదల అడ్డంకిగా మారింది. అధికారులు వెంటనే స్పందించి వంతెన వద్ద కానాలకు పట్టి వేసిన డెక్కను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



వంతెన వద్ద దట్టంగా ఉన్న డెక్క

పంచాయతీ కార్యాలయాన్ని తరలించొద్దు

రహదారిపై కనకాద్రిపురం వాసుల రాస్తారోకో

మరోసారి కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం

గంటపాటు స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గత ఐదేళ్లుగా తమ గ్రామంలో ఉన్న పంచాయతీ కార్యాలయాన్ని కుంతలగూడెం గ్రామం తరలించటానికి నాయకులు, అధికారులు ఏకపక్ష నిర్ణయం తీసుకోవటాన్ని నిరసిస్తూ మండలంలోని కనకాద్రిపురం గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. నాయకులు అధికారుల తీరును వ్యతిరేకిస్తూ గ్రామంలోని రాష్ట్ర రహదారిపై సుమారు గంట సేపు రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. టిడిపి కూటమి గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ కార్యదర్శి రాజవరపు శ్రీనివాసరావు, జనసేన గ్రామ కార్యదర్శి దుగ్గిరాల పెద్దిరాజు మాట్లాడారు. 2020లో పంచాయతీ విడదీసినప్పుడే తమ గ్రామం కుంతలగూడెం పంచాయతీలో కలవబోమని హైకోర్టులో దాఖలు చేసిన కేసు కారణంగా ఇరు గ్రామాల నాయకులను ఒప్పించి కనకాద్రిపురం గ్రామంలో కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల సమయంలో గ్రామ సర్పంచి హామీ ఇవ్వటంతో గ్రామస్తులమంతా ఎన్నికలకు సహకరించామన్నారు. ఇప్పుడు ఏరు దాటాక తెప్ప తగలేసిన రీతిగా సర్పంచి తన మాట మార్చి రాజకీయ పలుకుబడి ఉపయోగించి కార్యాలయం కుంతలగూడెం తరలించడానికి అధికారులను వాడుకుంటున్నారన్నారు. బలవంతంగా పంచాయతీలో తీర్మానం చేసి భవనం నిర్మించాలని చేసే ప్రయత్నాలపై కోర్టును ఆశ్రయించటంతో తమకు అనుకూలంగా వచ్చిన కోర్టు ఆదేశాలను అధికారులు వక్రీకరించి ఏకపక్షంగా కుంతలగూడెం గ్రామానికే మద్దతు ఇవ్వటం సరికాదన్నారు. కొయ్యలగూడెం ఎంపిడిఒ ఇరుగ్రామాల నాయకులతో జరిపిన చర్చల్లో తాము చెప్పిన అంశాలను పట్టించుకోలేదని విమర్శించారు. తమకు న్యాయం చేస్తామని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చినప్పటికీ కొందరు నాయకుల సహకారంతో గ్రామ సర్పంచి ఎంఎల్‌ఎను తప్పుదోవ పట్టించారని దుయ్యబట్టారు. సర్పంచికి, ఎంఎల్‌ఎకు తామంతా ఓటు వేసి గెలిపిస్తే, తామంతా వేరే పార్టీ వారమని సర్పంచి తప్పుడు రాజకీయాలు చేసి పంచాయతీ కార్యాలయాన్ని తరలించటానికి కుటిల యత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పంచాయతీ కార్యాలయం విషయంలో తమకు న్యాయం జరగకపోతే నిరవధిక నిరసనలు, నిరాహార దీక్షలు చేపడతామన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలు బహిష్కరిస్తామని ప్రకటించారు. ఏ పార్టీకి తమ గ్రామస్తులు ఓటు వేయబోరని గ్రామ నాయకులు నలమాటి సత్యభామ, సింగిదాసు అప్పారావు తెలిపారు. ఈ విషయమై మరోసారి కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఇవ్వన్నీ పరిగణలోకి తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. నినాదాలతో హోరెత్తిన రాస్తారోకోను ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని గంట తర్వాత విరమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు యంత్రపాటి రవి, జనసేన యూత్ నాయకులు బలే నరేంద్ర, టిడిపి యువత నాయకులు మాచర్ల గణేష్, చాపల సంకురియ్య, యలగందుల కృష్ణవేణి, యెల్లిబోయిన లక్ష్మి, తొంటా వరలక్ష్మి, పానుగంటి కామాక్షి, చిన్నం గవరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న కనకాద్రిపురం వాసులు

తాగునీటి పైపుల లీకేజీని అరికట్టాలి

జనవాణిలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజుకు వినతులు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంఎల్‌ఎ ఆదేశాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అప్పారావుపేట గ్రామస్తులకు చేబ్రోలు నూతుల చెరువు గట్టున బోరు నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల పైపు మార్గం ద్వారా తాగునీరు వస్తుంది. పివిసి పైపుల కారణంగా తరచూ లీకులతో నీటి ఇబ్బందులు పడుతున్నామని, వాటి స్థానంలో హెచ్‌డి పైపులను వేయాలని గ్రామస్తులు ఎంఎల్‌ఎ ధర్మరాజును కోరారు. ఆ గ్రామంలో జనవాణి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కాలనీలో రోడ్లు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు, వికలాంగ, వితంతు పింఛన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మను నిర్మించాలని, పలు సమస్యలను గ్రామస్తులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి పైపులకు గతంలోనే ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యుఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జాని తెలిపారు. సర్పంచి తానింకి ఆంజనేయులు, మాజీ సర్పంచి బళ్ల రమేష్, తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ ముత్తయ్య, హౌసింగ్ ఎఇ సిహెచ్.సతీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

బాల్య వివాహాలతో ఎన్నో నష్టాలు


ప్రజాశక్తి - మండవల్లి

బాలికకు వివాహం చేస్తే ఆ బాలిక ఆరోగ్యపరంగా, మానసికంగా ఎంతో నష్టపోతుందని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బాల్యవివాహాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యవివాహాల కలిగే నష్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని బాల్యవివాహాలను అడ్డుకోవాలన్నారు. బాల్యవివాహాలను అడ్డుకునేందుకు అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. బాల్యవివాహాల నిరోధక కమిటీ అధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడుతూ వివాహ వయస్సు రాకుండా వివాహం చేస్తే అమ్మాయి, అబ్బాయి తరపు బంధువులు, తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని తెలిపారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ఆశావర్కర్, అంగన్వాడీ కార్యకర్త, విఆర్ఒ, గ్రామ కార్యదర్శిని కమిటీగా నియమించినట్లు తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నెంబర్‌కు సమాచారం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణబాబు, ఐసిడిఎస్ కైకలూరు ప్రాజెక్ట్ సిడిపిఒ దీప్తి, సూపర్‌వైజర్లు వెంకట నాగలక్ష్మి, లక్ష్మీప్రసన్న, కార్యదర్శులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థినులు ఉన్నత చదువులు చదివి అభివృద్ధి బాటలోకి వెళ్లాలంటే చరిత్రలో మరువలేని నాయకుల జీవిత చరిత్ర ఆధారంగా విద్యాభ్యాసం చేయాలని ముసునూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి అన్నారు. పాఠశాలలో వైస్ ప్రిన్సిపల్ కె.ప్రసన్న ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్యం మహిళా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిబేట్, వ్యాసరచన, ఎస్ఐ రైటింగ్ పలు అంశాలపై నిర్వహించి, వారిలో ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న టిడిపి నాయకులు

విద్యామృతం-పౌష్టికాహారం ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు విద్యామృతం పౌష్టికాహారం పథకం పేరుతో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయమని ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొండేటి బాబు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, చదువులో ఏకాగ్రత పెంపొందించడం, మంచి ఫలితాలు రావాలనే ఉద్దేశంతో మంత్రి కొలుసు పార్థసారథి తమ తండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు కెపి.రెడ్డియ్య ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు అయ్యేవరకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటలకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి తోట శ్రీను, టిడిపి నాయకులు టి.రంగారావు, నక్క యోహాన్, ఉపాధ్యాయ సిబ్బంది, మధ్యాహ్న భోజనం పథకం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

2026కు సంబంధించిన క్యాలెండర్, డైరీని ఏలూరు యుటిఎఫ్ కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బొర్రా సుభాషిణి, ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి శివశంకర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ బంటు మోహన్, వివిధ మండలాల ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

సిఎం సహాయ నిధి చెక్కులను ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు శుక్రవారం ఆయన నివాసం వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పోలవరంలో ట్రైకార్ ఛైర్మన్ నివాసం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల వినతులు స్వీకరించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మంగిన కొండ, నీటి సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆకుల రాజా, పోతుల శ్రీను, నల్లా రాంబాబు, సుధీర్, జల్లేపల్లి నరసింహారావు, రవి, ఎల్ఎన్‌డిపేట గ్రామ కమిటీ అధ్యక్షులు ఇల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - దెందులూరు

విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్.శరణ్య బి.గాయత్రిలను, వారి ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నేరాలు - ఘోరాలు

బ్యారన్ల సామగ్రి అపహరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బ్యారన్‌లో భద్రపరిచిన సుమారు రూ.నాలుగు లక్షల విలువైన సామగ్రిని గుర్తు తెలీని వ్యక్తులు అపహరించుకుపోయిన ఘటన మండలంలోని ముప్పనవారిగూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ముప్పనవారిగూడెం గ్రామానికి చెందిన బళ్ల భూలక్ష్మి, నందిన సతీష్‌లకు ఆరు బ్యారన్‌లు ఉన్నాయి. ఐదు నెలల క్రితం పొగాకు సీజన్ పూర్తయిన తర్వాత ఆరు బ్యారన్‌ల సామగ్రిని బ్యారన్‌లో భద్రపరిచారు. శుక్రవారం ఉదయం బ్యారన్ తలుపు తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా సామగ్రి కనిపించలేదు. అపహరణకు గురైనట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితులు అధికారులను కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని జీలుగుమిల్లి సరిహద్దు సమీపంలో ద్విచక్ర వాహనంపై గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి పోలీసులు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనం సీటు కింద గంజాయి ప్యాకెట్లను పెట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని, బైక్‌ను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో కృషి చేస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు, ఏలూరు రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల దెందులూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఏలూరు పార్లమెంటు టిడిపి కమిటీలో స్థానం పొందిన సందర్భంగా పార్లమెంటు ఉపాధ్యక్షులు బొప్పన సుధాకర్, పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, అధికార ప్రతినిధులు గుడిపూడి రేవతి, సంపంగి వేణుగోపాల్ తిలక్, పార్లమెంట్ సెక్రటరీ తానంకి సురేష్‌లను అభినందించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ స్థానిక మౌలిక పరిస్థితులు, స్థితిగతులు సహా దామాషా ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో గ్రామాల్లోని రహదారులు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ గారపాటి రామసీత, పార్టీ మండలాధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్, నంబూరి నాగరాజు, మరడాని రవి, పార్టీ సీనియర్ నాయకులు కాశిబాబు, పెదవేగి సొసైటీ ఛైర్మన్ తాతా సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురం నుంచి అక్కంపేటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి పనులను జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి శుక్రవారం ప్రారంభించారు. అక్కంపేట సర్పంచి పారేపల్లి నాగేంద్రబాబు పాల్గొన్నారు. ఈ రోడ్డు పనుల ప్రారంభం కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జి మాట్లాడుతూ రహదారి అభివృద్ధితో గ్రామాలకు మెరుగైన రాకపోకలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రహదారులన్నీ కూడా మెరుగుపరిచే కార్యక్రమం చేపడుతుందన్నారు. రోడ్డు నిర్మాణంతో శ్రీనివాసపురం-అక్కంపేట గ్రామాల మధ్య రవాణా సౌలభ్యం పెరగడమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు మరింత సులభమవుతుందన్నారు.

రూ.1.60 కోట్లతో రహదారి నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు శాశ్వత పరిష్కారం చూపారు. బుట్టాయగూడెం జాతీయ రహదారి వద్ద నుంచి, బుట్టాయగూడెం బిసి కాలనీ మీదుగా తక్కెలపాడు వెళ్లే రెండు కిలోమీటర్ల తారు రోడ్డు వేయడానికి పనులు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవలే ఈ రహదారికి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. లంక సత్తిపండు చొరవతో రూ.1.60 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. బుట్టాయగూడెం గ్రామ ప్రజల ఎంఎల్ఎ వెంకటరాజుకు, టిడిపి మండలాధ్యక్షులు సత్తిపండుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ప్రత్యేక కృషితో ఉపాధి హామీ నిధులు రూ.90 లక్షలతో మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంఎల్ఎ వెంకటరాజుకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కొయ్యలమూడి వెంకట సరిత, పార్టీ గ్రామ అధ్యక్షులు ఘంటా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి ఎర్రగొల్ల రజిని, పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణకు సన్మానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి జిల్లా ఉపాధ్యక్షునిగా ఎంపికైన ఉంగుటూరు మండలం సీతారామపురానికి చెందిన వంగపండు సత్యనారాయణను పలువురు టిడిపి నాయకులు శుక్రవారం అభినందించారు. గణపవరం మాజీ ఎంపిటిసి సభ్యులు రొంగల శ్రీనివాస్, నిడమర్రు మాజీ వైస్ ఎంపిపి నౌడు అచ్చారావు, అప్పారావుపేట మాజీ సర్పంచి బళ్ల రమేష్ పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కేడర్ కలిసికట్టుగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా ఉపాధ్యక్షుడు వంగపండు పిలుపునిచ్చారు.

శీతాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



అవగాహనా ర్యాలీలో అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


శీతాకాలంలో చలి వాతావరణం కారణంగా ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శశాంక్ సూచించారు. ఏలూరు కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పంపుల సెంటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. చలి వాతావరణం వల్ల శరీరంలో మార్పులు చోటుచేసుకుని దగ్గు, జలుబు, తుమ్ములు, ఆయాసం, ఉబ్బసం, దద్దుర్లు, జ్వరాలు వంటి అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఉదయం వేళల్లో చలిలో తిరగకూడదని సూచించారు. చలికి రక్షణగా స్వెటర్లు, మంకీ క్యాపులు ధరించాలని, వేడివేడి ఆహారం తీసుకోవాలని, గోరువెచ్చని నీరు తాగాలని, చల్లని పానీయాలు నివారించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ దోమల నియంత్రణకు ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వారానికి ఒకసారి డ్రమ్ములు, తొట్టెలు శుభ్రం చేసి మూతలు పెట్టుకోవాలని, సాయంత్రం సమయంలో కిటికీలు మూసివేయాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్లు మేక శ్రీనివాస రావు, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు శ్రీలక్ష్మి, నీలాదేవి, రమాదేవి, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్త దేవి, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజా సేవ చేసిన బడేటి బుజ్జి

వర్ధంతి కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి, ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంతో బడేటి కుటుంబానికి ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందేనని, అటువంటి కుటుంబానికి చెందిన మాజీ ఎంఎల్ఎ, కీర్తిశేషులు బడేటి కోట రామారావు (బుజ్జి) నిస్వార్థ ప్రజా సేవ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జి ఆరో వర్ధంతిని పురస్కరించుకుని ఏలూరులో పలు కార్యక్రమాలు నిర్వహించి నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదానాలు చేసి, దుస్తులు పంపిణీ చేసి, అల్పాహారాలు అందించారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బడేటి బుజ్జి వర్ధంతి కార్యక్రమంలో బడేటి చంటి, గన్ని వీరాంజనేయులు, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బడేటి వెంకటరామయ్య బడేటి బుజ్జి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురికి తోపుడు బండ్లను, కుట్టు మిషన్లను, ట్రై సైకిళ్లను అందించారు. జోహార్ బుజ్జన్న గ్రూపు ఆధ్వర్యంలో 25 మంది కేన్సర్ పేషంట్లకు రూ.నాలుగు వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. పార్టీకి సేవలందించి మృతి చెందిన బుట్టి వెంకట్రావు, ఆర్నేపల్లి అప్పారావు కుటుంబాలకు ఎంఎల్ఎ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. బడేటి బుజ్జి స్ఫూర్తితో ఎంఎల్ఎ బడేటి చంటి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతుగా టిడిపి టి.నర్సాపురం మండలాధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ రూ.లక్ష విరాళాన్ని, ఇరదల ముద్దుకృష్ణ రూ.లక్ష, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు రూ.లక్ష, నంగులూరి సత్యనారాయణ రూ.20 వేల విరాళాలను అందించారు. టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, జిల్లా మీడియా కోఆర్డి నేటర్ చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాల్లో బడేటి, గన్ని

గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

2027 జూన్ 26 నుంచి జులై ఏడో తేదీ వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం డివిజన్ ఆర్‌డిఒ ఎంవి.రమణ శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక దిశా నిర్దేశాలు చేశారు. ఆర్‌డిఒ ఎంవి.రమణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటినుంచే పకడ్బందీ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విభాగం తమ పరిధిలో చేపట్టాల్సిన పనులపై పుష్కరాలకు సంబంధించిన ఎస్టిమేషన్‌ను సిద్ధం చేయాలని, వాటిని సమీకరించి ఐ ఎస్టిమేషన్ రూపంలో ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. పుష్కరాల సందర్భంగా రహదారులు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో మొత్తం 43 పుష్కర ఘాట్లు ఉన్నాయని తెలిపారు. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల సమయంలో సుమారు 15 లక్షల మంది యాత్రికులు ఈ ప్రాంతానికి వచ్చినట్లు అంచనా ఉందన్నారు. అదే స్థాయిలో కాకుండా మరింత అధికంగా యాత్రికులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావుతో పాటు రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మున్సిపల్ తదితర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలపై లైంగిక దాడుల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఎన్ఎంలు, ఐసిడిఎస్ సిబ్బంది, పోలీస్ శాఖ సంయుక్తంగా పాల్గొని బాలికలకు ప్రవర్తనలో మార్పులను గుర్తించే విధానం, అలాంటి ఘటనలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన సూచనలు అందించారు. సైకాలజిస్ట్ విమవిందు పిల్లలు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిపై వివరించి, భయపడకుండా సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంఇఒలు బి.రాముడు, జి.రాములు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త కమల, ప్రధానోపాధ్యాయుడు పి.సోమశేఖర్ మాట్లాడుతూ పిల్లల భద్రతకు సమాజం మొత్తం బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసం పెంపునకు వీర బాల దివస్ దోహదం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేందుకు, దేశ నిర్మాణం పట్ల స్ఫూర్తి పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వీర బాల దివస్-2025 కార్యక్రమం దోహదపడుతుందని భీమడోలు హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహమ్మద్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వీర బాల దివస్ పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఈశ్వర్, హేమంత్, సాయికిరణ్, హర్ష సభ్యులుగా ఉన్న టీమ్ క్విజ్, వక్తృత్వ పోటీల్లో హర్ష, చిత్ర లేఖన పోటీల్లో కనకమహాలక్ష్మి, వ్యాసరచన పోటీల్లో వర్ణిత ప్రథమ స్థానాలు దక్కించుకున్నారు. వీరిని పాఠశాల యాజమాన్యం తగు రీతిలో సత్కరించింది. ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు సెక్టార్ పర్యవేక్షకులు రూపా దేవి ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వంగవీటి రంగా

వర్ధంతి కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వంగవీటి మోహన్ రంగా 37వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి మంత్రి కొలుసు పార్థసారథి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పగడాల సత్యనారాయన, రఘు, ఆది, మధు, మాధవరావు, అనీల్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :వంగవీటి రంగా 37వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏలూరు నిర్వహించారు. కాపు బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిఆర్.రెడ్డి కళాశాల వద్ద ఉన్న రంగా విగ్రహానికి ఎంఎల్ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 200 మంది వృద్ధులకు చీరలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మారం అను, ఆరినేపల్లి తిరుపతిరావు, జనసేన నగర అధ్యక్షుడు వీరంకి పండు, పలువురు నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

భీమడోలు : పేదల అభ్యున్నతే లక్ష్యంగా, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసిన వంగవీటి మోహన రంగా ధన్యజీవి అని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సంతపేటలో ఉన్న వంగవీటి మోహనరంగా శిలావిగ్రహం వద్ద శుక్రవారం ఆయన అభిమానులు, కూటమి నాయకులు, ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి ఎంఎల్ఎ పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పత్తి మదన్, కూటమి నాయకులు యుగంధర్, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి కైకలూరు ఎంఎల్ఎ, గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఎంపిటిసి సభ్యులు మీసాల సాయి దుర్గాభవాని, కైకలూరు సర్పంచి కెవిఎం.నాయుడు, కైకలూరు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ వీర్రాజు, గుడివాడ వెంకట వరప్రసాద్, గుడివాడ వెంకయ్య బాలాజీ, సుధాబత్తుల విజయ్‌కుమార్, కొటికలపూడి రమేష్, మిత్రమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో...

చింతలపూడి : చింతలపూడిలో రంగా వర్ధంతి కార్యక్రమాన్ని వంగవీటి మోహన్‌రంగా విగ్రహ నిర్మాణ, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షులు కొత్తపూడి శేషగిరిరావు, అధ్యక్షులు తోట శివనాగరాజు (నాని), సెక్రటరీ ముత్యాల శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం చింతలపూడి పాత బస్టాండ్‌లో ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు చింతలపూడి కాపు నాయకులు, పలు సంఘాల నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలోని స్థానిక గరుడు బొమ్మ సెంటర్‌లో ఉన్న వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వంగవీటి మోహన్ రంగా అభిమానులు, కాపు యువత, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జి, రావూరి కృష్ణ, దాకారపు కృష్ణ, నరేష్ నాయుడు, కాపు నేతలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ, చిగురుకోట, చేవూరుపాలెం, తదితర గ్రామాల్లో ఉన్న రంగా విగ్రహాలకు అన్ని పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైసిపి నాయకులు ఆయా గ్రామాల్లో రంగా విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు.

ఆగిరిపల్లి : మండలంలోని వట్టిగుడిపాడు, ఆగిరిపల్లి, కొమ్మూరు, సూరవరం గ్రామాల్లో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన వట్టిగుడిపాడు నాయకులు బండారు శివ, పి.జోగేశ్వరరావు, పి.చింతారావు, డి.రాము, ఎం.శ్రీరామమూర్తి, ఎ.లక్ష్మీనారాయణ, ఆర్.నటరాజు, ఎస్.రంగారావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : స్థానిక హెచ్‌పి పెట్రోల్ బంక్ పక్కన ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, కూటమి నాయకులు శ్రీను, బాలు, మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు పలు అర్జీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. అధికంగా ఆరు రెవెన్యూ అర్జీలు రాగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు కొన్నింటిని తక్షణమే పరిష్కరించగా మరికొన్ని త్వరలో పరిష్కరిస్తామని భరోసా ఇచారు. ముసునూరు మండలం రామణక్కపేట గ్రామానికి చెందిన రైతు తమ భూమికి సంబంధించి కొలతలు సర్వే అవకతవకలు జరిగాయని తెలియజేయగా మంత్రి విఆర్ఒను, సర్వేయర్‌ను వివరాలు అడగగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పూర్తి వివరాలతో రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆగిరపల్లి తహశీల్దార్ ప్రసాద్, ఆగిరపల్లి ఎంపిడిఒ, ముసునూరు, నూజివీడు తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ కె.పీరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై డిఇఒకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇన్-సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ పరీక్ష పాస్ కావాలని, లేకపోతే ఉద్యోగాల నుంచి తొలగించాలనే నిబంధనపై ఉపాధ్యాయ లోకంలో తీవ్ర ఆందోళన నెలకొందని ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మకు సంఘం తరపున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేతాళ సుదర్శనం, జిల్లా అధ్యక్షులు కాకర్ల దొరబాబు, అధ్యక్షులు అంగుళూరు సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ నిబంధనను తక్షణమే ఉపసంహరించుకోవాలని, అలాగే ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని కోరారు. 2025 సెప్టెంబర్ ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులపై టెట్ షరతును అమలు చేయడం అసమంజసం, అన్యాయం, ఆచరణలో అసాధ్యమని చెప్పారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, వారి సేవలను అవమానించే విధంగా కాకుండా వారికి అండగా ప్రభుత్వం నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షులు జొన్నకూటి రాజారావు, జిల్లా కోశాధికారి కుర్మా ఆనంద్, ఏలూరు నగర అధ్యక్షులు ఎం.బెన్‌హర్, సహ అధ్యక్షులు ఉన్నమట్ల కాంతి, జయకుమార్, నగర గౌరవ అధ్యక్షులు టిఎన్‌డివి.ప్రసాద్, కోశాధికారి కె.కిషోర్, సీనియర్ సభ్యులు బి.లాజరు, కంకర్ల దాస్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ కార్యాలయంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ దైవ సేవకులు ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమాలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ పాస్టర్లకు కూటమి ప్రభుత్వం నెలకు రూ.ఐదు వేల చొప్పున 8,418 మందికి గౌరవ వేతనం అందిస్తూ రూ.51 కోట్లను విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పాస్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, మహిళా నాయకులు, దైవ సేవకులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.